ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 14 జూలై 2025

తూపిలిపాళెంలో హోయ్.. హోయ్



వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలతో పాటు తిరుపతి నుంచి వచ్చిన పర్యాటకులతో తీరం కళకళలాడింది. పిల్లలు, యువత ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ నాగబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. - వాకాడు, ఆంధ్రజ్యోతి

వానరాలకు పండ్లు



భాకరాపేట ఘాట్‌కు రెండువైపులా వానరాలు గుంపులుగా చేరుతుంటాయి. తిండికోసం వచ్చీ పోయే వాహనాల వైపు ఆశగా ఎదురు చూస్తుంటాయి. దీనిని గమనించిన భాకరాపేట ఇటుకల బట్టీ యజమాని సిద్దరామిరెడ్డి వారంలో మూడు రోజులు బిస్కెట్లు, పండ్లు అందిస్తున్నారు. - భాకరాపేట, ఆంధ్రజ్యోతి

పట్టర ఓ పట్టు



అది చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లే దారి. దీనికి అడ్డంగా ఉన్న కాలువపై ఇనుప రాడ్లతో జల్లెడలా వేయగా.. అది వంగిపోయింది. ఇలా ఆదివారం వారపు సంతకోసం కొందరు రైతులు కలిసి మినీ లారీలో కూరగాయలు వేసుకుని రాగా ఆగిపోయింది. దీంతో మహిళా రైతులూ తమ వంతు చేయి వేసి నెట్టడంతో ముందుకు కదిలింది. - చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

క్యాన్సర్‌ను అరికట్టేందుకు కృషి చేద్దాం

● టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో సీఎంఈ సదస్సు

తిరుపతి(వైద్యం), జూలై 13(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక పద్ధతులను అనుసరించి క్యాన్సర్‌ను సంపూర్ణంగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరం కలిసి కృషి చేద్దామని హైదారాబాదుకు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన అంకాలజిస్టు డాక్టర్ సుబ్రమణ్యేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి నగరం జూపార్కు రోడ్డులోని స్వీకర్(టాటా క్యాన్సర్ ఆస్పత్రి)లో ఏపీ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ(ఏపీఏఎస్‌వో) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీఎంఈ(కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) సదస్సులో ఆయన మాట్లాడారు. స్వీకర్ ఆస్పత్రిలో ల్యూమినల్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్(జీఐ) క్యాన్సర్లపై దృష్టి సారిస్తూ క్యాన్సర్ నిర్మూలన దిశగా అడుగులు గొప్ప విషయమన్నారు. ఏపీఏఎస్‌వో రాష్ట్రంలో సర్జికల్ ఆంకాలజీ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న వృత్తిపరమైన సంఘమని ఇది వైద్య విద్యను, పరిశోధనలను ప్రోత్సహిస్తుందన్నారు. ఇటువంటి సీఎంఈ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల సర్జికల్ ఆంకాలజీ నిపుణుల మధ్య సహకారాన్ని పెంచడంతోపాటు ఆధునాతన వైద్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ సదస్సులో భాగంగా అత్యాధునిక పద్ధతులు, మల్టీ డిసిప్లినరీ ట్రీట్మెంట్, కొత్త శస్త్ర చికిత్సా విధానాలపై చర్చలు జరపడం ద్వారా మన ప్రాంతంలో క్యాన్సర్ బాధితులకు మెరుగైన ఫలితాలు అందించే అవకాశం లభిస్తుందని స్వీకర్ ఆస్పత్రి సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంత్ పెనుమాడు తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు తమ అనుభవాలను, అధునాతన వైద్య పద్ధతులను వివరించారు. ప్రముఖ అంకాలజిస్టులు శరద్ దేశాయ్, రుద్ర ప్రసాద్ ఆచార్య, నరేంద్ర, మురళీకృష్ణ, నాగకిశోర్, హరికృష్ణతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంకాలజిస్టులు దాదాపు 280 మంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రముఖ సర్జికల్ అంకాలజీ వైద్య నిపుణులు

తిరుమలలో భక్తుల రద్దీ



తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గురువారం సాయంత్రం నుంచి తిరుమలకు భక్తుల తాకిడి పెరిగిన విషయం తెలిసిందే. శుక్ర, శనివారాల తరహాలోనే ఆదివారం కూడా భక్తులతో తిరుమల కొండ కిటకిటలాడింది. సాధారణంగా ఆదివారం సాయంత్రానికి వారాంతపు రద్దీ తగ్గుతుంది. కానీ ఆదివారం రాత్రి 9 గంటలైనా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరి పార్కులోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శన సమయం పడుతోంది. క్యూలైన్‌లో చేరే భక్తుల సంఖ్య కొనసాగుతునే ఉన్న క్రమంలో సాయంత్రానికి కల్యాణవేదిక వద్ద క్యూలైన్ మూసివేశారు. రద్దీ అధికంగా ఉన్న క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు క్యూలైన్‌లోకి ప్రవేశించాలని ప్రకటనలు చేస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రింగురోడ్డులోని క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు

టాపాయిండ్లు కేంద్రంగా డీజిల్ దందా

60 తమ యజమానులకు తెలియకుండా లారీ డ్రైవర్లు డీజిల్‌ను దుకాణదారులకు అక్రమంగా అమ్మే ధర ఇది.

89 స్థానిక వాహనదారులు, ఒక్కోసారి పెట్రోల్ బంకుల వాళ్లకూ దుకాణదారులు విక్రయించే ధర.

● లారీల వద్ద తక్కువ ధరకు కొని విక్రయాలు ● అధికారుల దాడులు.. కేసు నమోదు చేయని వైనం

దొరవారిసత్రం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీజిల్ అక్రమ విక్రయాలకు దొరవారిసత్రం మండలం టపాయిండ్లు కేరాఫ్‌గా మారింది. సూళ్లూరుపేట టోల్ ప్లాజాకు చేరువలో ఉన్న ఈ గ్రామంలో జాతీయ రహదారికి రెండు వైపులా ఇళ్లున్నాయి. ఇళ్ల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకొని లారీల నుంచి డీజిల్ కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. ఇలా పది మంది దీనినే వ్యాపారంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. వేలాది లీటర్ల డీజిల్ నిల్వ చేసి ఉంచుతున్నారు. గతేడాది డీజిల్ విక్రయాల దుకాణాలు మరిన్ని పెరిగాయి. తమ దుకాణాల వద్ద డీజిల్ కొనుగోలుకు ఒక సంకేతంలా వాటర్ క్యాన్లు, డీజిల్ క్యాన్లను జాతీయ రహదారి పక్కన వేలాడ కడుతున్నారు. వీటిని చూసిన లారీ డ్రైవర్లు ఆ దుకాణాల వద్ద ఆపి.. ఆ లారీల నుంచి లీటర్ రూ.60 వంతున డీజిల్ అక్రమంగా అమ్మేస్తుంటారు. వచ్చిన కాడికి లాభం అనుకుని ఇలా తమ యజమానులను మోసం చేస్తున్నారు డ్రైవర్లు. ఈ డీజిల్‌ను కొనే దుకాణదారులు స్థానికంగా ట్రాక్టర్ల యజమానులకు, ఇతర వాహనాలకు లీటర్‌ను రూ.89 లెక్కన ఇస్తున్నారు. ఇద్దరు దుకాణదారులైతే పెద్ద ఎత్తున్న నిల్వలు చేసి సూళ్లూరుపేటలోని ఓ పెట్రోల్ బంకు యాజమాన్యంకు అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. ఓ మినీ డీజిల్ ట్యాంకర్ ఈ దుకాణాల వద్దకు వచ్చి తీసుకెళుతుండటం గమనార్హం. ఇలా నెలకు లక్షలాది లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయి.



టపాయిండ్లు వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన క్యాన్లు

అధికారుల దాడులు.. కేసులేవీ మరి

స్థానికుల ఫిర్యాదు నేపథ్యంలో ఇక్కడి డీజిల్ విక్రయాలపై శనివారం గూడూరు సెక్షన్‌కు చెందిన తూనికల కొలతలు (లీగల్ మెట్రాలజీ) శాఖ అధికారులు దాడులు చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 10 దుకాణాలపై దాడులు జరిపారు. రెండు దుకాణాల్లో సుమారు నాలుగు వేల లీటర్ల డీజిల్ ఉన్నట్లు గుర్తించారు. మరో నాలుగు దుకాణాల్లో 5 వేల లీటర్లు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. డీజిల్ అక్రమ నిల్వలపై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. చర్యలూ తీసుకోలేదు. జరిమానా పేరిట చేసిన వసూళ్లకూ ఎలాంటి రశీదులు ఇవ్వలేదు

జరిమానాలు విధించాం

ఈ వ్యవహారంపై తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. టపాయిండ్లు వద్ద డీజిల్ విక్రయాల దుకాణాలపై దాడులు చేశామని తెలిపారు. నాలుగు దుకాణాలకు రూ.37 వేల జరిమానా విధించామన్నారు. దుకాణదారులకు జరిమాన రశీదులు ఇచ్చారా అని అడగ్గా.. సమాధానం దాటవేశారు. పంచనామాలు రాసుకొచ్చినట్లు చెప్పారు. డీజిల్ అక్రమంగా విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేశారా అనగా.. విజిలెన్స్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.



శ్రీనివాసులు మృతదేహం వద్ద విలపిస్తున్న సోదరి కీర్తి - శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)

న్యాయం జరిగే వరకు పోరాటం

● రాయుడి సోదరి కీర్తి ఆవేదన.. స్పష్టీకరణ
● మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి ● వినుత దంపతులతోపాటు మరో ముగ్గురికి 14 రోజుల రిమాండ్

శ్రీకాళహస్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మా అన్న రాయుడు (శ్రీనివాసులు) హత్యకేసులో న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని కీర్తి ఆవేదనా స్వరంతో చెప్పారు. శ్రీకాళహస్తి మండలం బొక్కిసంపాళేనికి ఆదివారం చెన్నైనుంచి మృతదేహం రాగానే అమ్మమ్మ రాజేశ్వరి, సోదరితో పాటు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. కీర్తి విలపిస్తూ, మాట్లాడారు. 'జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ప్రాణం కన్నా ఎక్కువగా మా అన్న అభిమానించేవాడు. ఎన్నో సంవత్సరాల నుంచి జనసేన ఇన్‌చార్జి వినుత దంపతుల వద్ద అహర్నిశలు శ్రమిస్తూ వారిఉన్నతి కోసమే తపించేవాడు. ఇటీవల మా అన్న కాలు జారిపడటంతో గాయమైందని వినుత దంపతులు మాకు ఫోన్ ద్వారా చెప్పారు. మేము ఇంటికి వెళ్లి చూడటంతో కాలికి గాయమైంది. మా అన్న శ్రీనివాసులుకు రెండువైపులా ఇద్దరు కూర్చుని మాట్లాడనీయకుండా కట్టడి చేశారు. మా వ్యక్తిగత విషయాలను రాజకీయ ప్రత్యర్థులకు మీ అన్న చెరవేస్తున్నాడంటూ వినుత దంపతులు మాకు చెప్పారు. తర్వాత మళ్లీ విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి ఇంటికిపంపేశారు. ఆ తరువాత కూడా చాలాసార్లు పిలిపించుకున్నారు. పని కోసం పిలుస్తున్నారని మేం అనుకున్నాం. కానీ చిత్రహింసలకు గురి చేసి హతమార్చేశారు. చెన్నై పోలీసులు చెప్పే వరకు మా అన్న చనిపోయాడన్న విషయం కూడా తెలియదు. వారిని కఠినంగా శిక్షించాలి' అంటూ కీర్తి కోరారు. కాగా, మృతదేహం రాక సమాచారం తెలుసుకున్న శ్రీనివాసులు అలియాస్ రాయుడు స్నేహితులు, బంధువులు బొక్కిసంపాళెం చేరుకుని ఘనంగా నివాళులు అర్పించారు. వైసీపీ నేత అంజూరు శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు.

నిందితులకు 14రోజుల రిమాండ్

డ్రైవర్ శ్రీనివాసులును హత్య చేశారన్న కేసులో చెన్నైలోని సి3 సెవెన్ వెల్స్ పోలీసులు జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన మాజీ ఇన్‌చార్జి వినుతతోపాటు భర్త చంద్రబాబు, వారికి సహకరించిన శివకుమార్, గోపి, తస్సర్ బాషాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి న్యాయమూర్తి ఎదుట వారిని చెన్నై పోలీసులు హాజరు పరచగా 14రోజుల పాటు రిమాండ్ విధించారు. చెన్నైలోని పుళల్ సెంట్రల్ జైలుకు వీరిని తరలించారు.

గ్రూప్-2 బ్యాక్‌లాగ్ పోస్టుల పేరిట రూ.85 లక్షల మోసం

● పోలీసులకూ ఫిర్యాదు ● చర్యల్లేవంటూ మీడియాకెక్కిన బాధితులు

తిరుపతి(నేర విభాగం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఎంప్లాయిమెంట్ ఆఫీసులో అధికారిని చెప్పారు. ఉద్యోగాలు తీసిస్తానని రూ.85 లక్షల వరకు వసూలు చేసి.. మోసం చేశారు. దీనిపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ బాధితులు శుక్రవారం మీడియాను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. రెవెన్యూ విభాగంలో బ్యాక్‌లాగ్ (తహసీల్దారు, డీటీ, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్) పోస్టులు ఇప్పిస్తామని తిరుపతి ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగినంటూ ఒకరు పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు వసూలు చేశారు. తన పిన్ని, బాబాయ్‌ని, మంగళగిరిలో ఓ ఉన్నతాధికారిని కలుపుకొని ప్లాన్ ప్రకారం నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన రబ్బర్ స్టాంపులు, లెటర్ ప్యాడ్లు తయారు చేశారు. ఒప్పందం కుదిరిన అభ్యర్థులకు.. తిరుపతిలో ప్రభుత్వ తరహాలో పరీక్ష నిర్వహించారు. సెల్ఫ్ ఇంటర్వ్యూ, వీడియో తీసుకున్నారు. కాంపిటీటివ్ మెరిట్ లెటర్లు పంపారు. తర్వాత అపాయింట్‌మెంట్ లెటరు వస్తుందని, వేచి చూడాలని చెప్పారు. 14 నెలలుగా ఎదురు చూసినా అపాయింట్‌మెంట్ లెటర్లు రాలేదు. దీంతో వీరంతా రెండు నెలల కిందట సంబంధిత ఆఫీసుకు వెళ్లి అడగ్గా.. ఇవన్నీ నకిలీ లెటర్లని, నకిలీ స్టాంపులని చెప్పడంతో కంగుతిన్నారు. ఆ నలుగురిని ప్రశ్నించినా.. డబ్బులిచ్చేయమని బతిమలాడినా సమాధానం లేకపోగా, చివరకు ఎదురు బెదిరింపులకు దిగినట్లు సమాచారం. దీంతో తిరుపతికి చెందిన దాదాపు 20 మందిలో 14 మంది బాధితులు ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. రెండు నెలలవుతున్నా పోలీసుల నుంచి సమాధానం రాకపోవడంతో బాధితులు ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌కు వచ్చి మీడియాకు వివరించారు. సోమవారం కలెక్టర్‌ను కలవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కేసు దర్యాప్తులో ఉంది

బాధితులు ఎస్పీ హర్షవర్ధనరాజుకు రెండు నెలల కిందట ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే ఆయన విచారించి కేసు నమోదు చేయాలని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలంను మే 24న ఆదేశించారు. ఈ కేసు తిరుపతి రూరల్ పరిధిలోది కావడంతో ఆయన.. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్‌కు పంపారు. ఈ అంశాన్ని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుతో 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం యర్రమరాజుపల్లెకి చెందిన ఎ.రాధాకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఉద్యోగినంటూ చెప్పిన పి.లక్ష్మితో పాటు వి.వేణుగోపాల్, పి.విద్య, హారికపై మే నెలలోనే కేసు నమోదు చేశామని.. దర్యాప్తు దశలో ఉందని సీఐ చెప్పారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దేవర మనోహర్

చంద్రగిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ కోరారు. ఆదివారం చంద్రగిరిలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాకాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి మాధురి రెమిడీ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 354 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్య చికిత్స కోసం 30 మందిని మాధురి వైద్యశాలకు, వాసన్ కంటి వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ హరిదీప్, డాక్టర్ అభిషేక్, డాక్టర్ బాలకృష్ణ, సీఈవో మంజునాథ్, డీవో రవీంద్రరెడ్డి, పీఆర్వోలు లోకేష్, సునీల్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేఎన్‌తులసీరామన్, కుప్పుస్వామినాయుడు, జి.రామయ్య, ఆర్వీ ప్రసాద్, జయరామనాయుడు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



తిరుచానూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి సన్నిధిలోని మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ వాహిని రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న సాయినగర్ సర్పంచ్ రమణ

తిరుచానూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుని ప్రపంచ శాంతిని కోరుకుంటూ సత్యసాయి ప్రేమవాహిని రథయాత్ర తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌లోని సత్యసాయి మందిరం నుంచి ఆదివారం సాగింది. సర్పంచ్ డీపీ రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా ఉచిత విద్య, వైద్యం, తెలుగుగంగ నీరు అందించి ప్రజల దృష్టిలో దేవుడిగా నిలిచిపోయారన్నారు. సత్యసాయి ట్రస్టు చైర్మన్ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఈ రథం దేశమంతటా తిరుగుతుందన్నారు. సేవా సమితి కోఆర్డినేటర్లు సర్వేశ్వరరావు, పాణి, దినేష్, రామ్మోహన్, సమితి కన్వీనర్లు లోకనాథనాయుడు, దేవసేన, కృష్ణవేణి, శ్రీధర్, చక్రవర్తి, మురళి, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.51 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 92,221
తలనీలాలు సమర్పించినవారు: 42,280

ఆకట్టుకున్న కర్ణ జననం



రామచంద్రాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భగవతారిణి అనసూయ వినిపించిన కర్ణ జననం సభికులను ఆకట్టుకుంది. దుర్వాస మహాముని కుంతిదేవికి ఇచ్చిన వరాన్ని పరీక్షించడానికి సూర్యదేవుని ప్రార్థించగా కవచ కుండలాలతో కర్ణుడు జన్మించే ఘట్టాలను అనసూయ రమ్యంగా వినిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజ మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

కాలువపై ఇనుప గ్రిల్‌కు మరమ్మతు చేయండి



టవర్ క్లాక్ వద్ద కాలువపై వంగిపోయిన గ్రిల్

చంద్రగిరి, జూలై 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నడిబొడ్డున ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలో కాలువపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే మార్గంలోని మురుగు కాలువను శుభ్రం చేయడానికి పంచాయతీ అధికారులు ఇనుప రాడ్లతో జల్లెడ మాదిరిగా ఏర్పాటు చేశారు. ఈ కాలువపై నిత్యం వాహన రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలోనే ప్రభుత్వ ఆసుపత్రి, కోదండరామాలయం, విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ సబ్ స్టేషన్‌లకు వెళ్లాల్సి ఉంది. అయితే కాలువ వెడల్పుగా ఉండటంతో ఇనుప రాడ్లు వంగిపోవడంతో వాహనాలు కాలువపై వెళితే ప్రమాదాలు జరుగుతున్నాయి. రోగులు అత్యవసరంగా ఆసుపత్రికి వస్తుంటారు. 108 వాహనం కూడా దీన్ని దాటుకునే క్రమంలో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. కార్లు లాంటి పెద్ద వాహనాల చక్రాలు కాలువలో దిగడంతో పంక్చర్ అవుతున్నాయి. ప్రతి ఆదివారమూ ఈ ప్రాంతంలోనే వారపు సంత జరుగుతుంది. వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గతంలోనే పంచాయతీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

సత్పురుషుల బోధనలు సన్మార్గానికి సోపానాలు

● కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుచానూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): అత్యంత దుర్లభమైన మానవజీవితాన్ని సన్మార్గంలో నడిపించేందుకు సత్పురుషులు భారత, భాగవత, రామాయణాలను బోధించారని, తద్వారా జీవితం సన్మార్గంలో నడుస్తుందని కె.సి.దాస్ స్మారక సేవా సంస్థ వ్యవస్థాపకులు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. తిరుచానూరు మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన కేసీ దాస్ స్మారక సేవా సంస్థకు ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ అయిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో పద్మావతి శ్రీనివాసుల కల్యాణం శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన అభిభాషిస్తూ లోకకల్యాణార్థం పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో శ్రీవారి కల్యాణం జరిపించామన్నారు. సనాతన ధర్మవారధి తిరుపతి నిర్వాహకులు ఖండవిల్లి రాధాకృష్ణ శర్మ, పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఉదయం పుణ్యావచనం, గణపతి పూజతో అర్చకులు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, కాన్యదానం, హోమం మాంగల్యధారణ, పూర్ణాహుతి, మాల మార్పిడి, తలంబ్రాలు, మహానవిదేన, నక్షత్ర హారతి, మహా మంగళ హారతితో ఈ కార్యక్రమం పరిసమాప్తమైంది. కల్యాణోత్సవం అనంతరం ప్రసాదం, కంకణాల వితరణ జరిింది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తిరుపతి ప్రాంతాల నుంచి ట్రస్ట్ సభ్యుల సహా సుమారు 250 మంది హాజరయ్యారు.

ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించడమే లక్ష్యం



కొల్లాపురి అమ్మవారిని దర్శించుకున్న పీఠాధిపతి సింహయాజి

భాకరాపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించడమే తమ లక్ష్యమని తిరుపతి మంత్ర రాజపీఠం పీఠాధిపతి సింహయాజీ అన్నారు. సప్తగిరుల ప్రదక్షిణ యాత్రలో భాగంగా ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డలో వెలసిన కొల్లాపురి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వలసారెడ్డి శివప్రసాద్ రెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. పీఠాధిపతి మాట్లాడుతూ అలిపిరి పాదాల నుంచి శేషాచలం కొండలు విస్తరించి ఉన్న 320 కిలోమీటర్ల మేర ఉన్న ఆలయాలను ప్రతినెలా శ్రవణా నక్షత్రం రోజున సందర్శించి, దేవుళ్లను దర్శించుకుంటామన్నారు. అందులో భాగంగా ఆదివారం కొల్లాపురమ్మను దర్శించుకున్నామన్నారు. విద్యార్థులు, గ్రామీణుల్లో ఆధ్యాత్మిక భావన పెరగాలని, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. అనంతరం దేవరకొండ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త శివప్రసాద్ రెడ్డి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆదిశంకరాచార్య యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ పెంచలయ్య, సుప్రీంకోర్టు న్యాయవాది మంజునాథ్ మడియార్ శేఖర్ రెడ్డి, వైద్యనాథ్ స్వామి, హరీశ్ బాబు, వినోద్, శ్రీవాత్సవ శ్రీనివాసరావు, తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ కమిటీ చైర్మన్ ఆదినారాయణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం



తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం పెద్దజీయంగార్ చాతుర్మాస దీక్ష సంకల్పం ప్రారంభమైంది. అంతకు ముందు పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం పెద్దజీయంగారు చిన్నజీయర్ స్వామి మఠానికి ఊరేగింపుగా బయలుదేరి, స్వామి పుష్కరిణి, వరాహస్వామి బాలాలయాన్ని సందర్శించారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అక్కడి నుంచి మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్శనం తర్వాత పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం పెద్దజీయర్ మఠంలో జీయర్ స్వాములు ఈవో, అదనపు ఈవోలను శాలువాతో సన్మానించారు.

ముగిసిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గిరిజన భవనంలో రెండు రోజులుగా జరిగిన 5వ ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్, రెజ్లింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభచాటిన బాలబాలికలు సబ్‌జూనియర్స్ విభాగంలో 20మంది చొప్పున, క్యాడెట్ విభాగంలో 10మంది చొప్పున జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 26నుంచి 29వరకు బాలాస్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లో జరిగే జాతీయస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలలో ప్రాతినిథ్యం వహించనున్నారు. ఏపీ క్రీడా భారతి అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు, సంయుక్త కార్యదర్శి సురేంద్రరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి, వెంకటరావు, శివకుమార్, సాయిసుమతి, రత్నరాణి, శ్యామల మురళీకృష్ణ తదితరులు విజేత క్రీడాకారులను అభినందించారు.



శ్రీవారి సేవలో మంత్రి గొట్టిపాటి

తిరుమల శ్రీవారిని ఆదివారం రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మద్యం మత్తులో హత్యాయత్నం

● కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులో సర్వర్‌పై ఓ మందుబాబు బీరు బాటిల్‌తో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్‌ఐ గిరిబాబు కథనం మేరకు.. తిరుపతి నగరం జయశ్యాం థియేటర్ రోడ్డులోని ఓ మద్యం దుకాణం వద్ద శనివారం అర్ధరాత్రి పుత్తూరుకు చెందిన మురళి తప్పతాగారు. ఆ మత్తులో దుకాణం ముందు మూత్ర విసర్జన చేస్తుండగా, కడపకు చెందిన వెంకటరమణపై బీరు బాటిల్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో అతడికి గొంతుపై గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ గిరిబాబు ఘటనా స్థలానికి వెళ్లి బాధితుడ్ని ఆస్పత్రికి తరలించారు. హత్యాయత్నానికి పాల్పడిన మురళిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు.

ముక్కంటి క్షేత్రం భక్తజన సందోహం



ఆలయంలోని క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 892 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,552, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 5,490మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,320 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,819, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 463మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 298, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 101మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,706 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

15నుంచి విజ్ఞానగిరిలో ఆడికృత్తిక ఉత్సవాలు



శ్రీకాళహస్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 20న ఆడికృత్తిక మహోత్సవం జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. 15నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. వారాంతపు సెలవు కావడంతో తిరుపతికి చెందిన శ్రీనాట్యాలయ విద్యార్థులు భవిశ, దామిని, రోషిణి, కీర్తన, తనుశ్రీ, రమ్య తదితరులు వక్రతుండ మహాకాయ, చిన్ని శిశువు, బ్రమహామోకెట్, మూషిక వాహనం, నాగేంద్ర హారాయ తదితర కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారికి శిల్పారామం ఇన్‌చార్జి పరిపాలనాధికారి సూర్యతేజ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



దేవరకొండలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహేందర్ రాయల్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రావు, శివకుమార్, సునీల్, హరికృష్ణ, కుమార్, సుబ్రహ్మణ్యం, గురుస్వామి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తోందని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మోహనమురళి అన్నారు. మండలంలోని పుల్లమనాయుడుకండ్రిగ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో గోపి చౌదరి, చెంగల్రాయులు, హేమాద్రి, విజయకుమార్, వాసునాయుడు పాల్గొన్నారు.

జనార్దన చౌదరికి సన్మానం



రామచంద్రాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆర్సీపురం సింగిల్ విండో చైర్మన్‌గా నియమితులైన జనార్దన చౌదరికి టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఘన సన్మానం చేశారు. ఆయనతో కలిసి కేకేవీపురంలో 1982, 1983లలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సన్మానించారు. టీడీపీ అభివృద్ధికి కృషి చేసినందుకు పదవి దక్కిందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాంధీ, చలపతి నాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం



మృతి చెందిన చంద్రమౌళి

తవణంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కారును ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం దామల చెరువుకు చెందిన చిన్న మునెయ్య కుమారుడు చంద్రమౌళి(34) తవణంపల్లెకు ఆదివారం ద్విచక్ర వాహనంలో వచ్చాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో తిరుపతి -బెంగళూరు హైవేపై తవణంపల్లె మండలంలోని నత్తపునేను సమీపంలోకొచ్చేసరికి తిరుపతి నుంచి తమిళనాడులోని బంగారు గుడికి వెళుతున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోట శ్రీనివాసరావుకు నివాళి



కోట శ్రీనివాసరావుకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కళాకారులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 13(ఆంధ్రజ్యోతి): విలక్షణ నటుడు, బీజేపీ నేత కోట శ్రీనివాసరావుకు బీజేపీ నాయకులు, రంగస్థల కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. కోట మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. విలక్షణ నటుడిగా ఆయన తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండాల గోపినాథ్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రంగస్థల కళాకారులు సంఘం కార్యదర్శి కేఎన్ రాజ, సభ్యులు లోక వెంకటరత్నం, సహదేవరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, విద్వాన్ కస్పా పద్మనాభం, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

వేడుకగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

హాజరైన ఏడవ తరం వారసులు



తాళిబొట్టు చూపుతున్న వేదపండితుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఆదివారం కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి - గోవిందమాంబ కల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అంతకుముందు హోమం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి వారుసులలో ఏడవ తరానికి చెందిన వీరంభట్ల స్వామి సతీమణితోపాటు హాజరయ్యారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలజ్ఞానం ద్వారా ప్రజల్లో వీరబ్రహ్మేంద్రస్వామి గొప్ప మార్పు తెచ్చారని కొనియాడారు. గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు నాగరత్నంరెడ్డి, ఉమాపతి ఆచారి, గిరిబాబు ఆచారి, శివకుమార్, భక్తులు హాజరయ్యారు. భక్తులకు వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాంగ్రెస్ నేత మృతికి సంతాపం



అబ్దుల్ మజీద్‌కు నివాళి అర్పిస్తున్న చింతా మోహన్

తిరుపతి (వైద్యం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత పటేల్ అబ్దుల్ మజీద్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. తిరుపతికి చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మజీద్ ఇంటికెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అబ్దుల్ మజీద్ సాహెబ్ 50 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేశారన్నారు. అటువంటి వ్యక్తి మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా జయప్రకాష్‌రెడ్డి



జయప్రకాష్‌రెడ్డిని అభినందిస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ తిరుపతి రూరల్ కాలూరు మండల కన్వీనర్‌గా మాజీ సైనికుడు గంపల జయప్రకాశ్‌రెడ్డి నియమితులయ్యారు. తిరుపతి విద్యానగర్‌లోని శ్రీనాథ్ ధామంలో మేడసాని పురుషోత్తం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి ఆయన నియామకాన్ని ప్రకటించారు. నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సైనికుడిగా విశేష సేవలందించిన జయప్రకాష్‌రెడ్డి బీజేపీ మండల కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆదర్శనీయమన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని జయప్రకాశ్‌రెడ్డి చెప్పారు.

డ్వాక్రా మహిళల సొమ్మును రికవరీ చేయండి

తిరుపతి(ఆటోనగర్), జూలై13 : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని మెప్మా అధికారులు కాజేసిన డ్వాక్రా మహిళల పొదుపు సొమ్మును రికవరీ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి కోరారు. మూడవ డివిజన్ ఆర్పీ కొన్ని నెలలుగా మహిళా సంఘాల నుంచి వసూలు చేసిన డబ్బును బ్యాంక్‌లో చెల్లించకుండా నకిలీ బ్యాంక్ స్టాంపులను తయారు చేసుకుని కాజేస్తూ వచ్చారని ఆరోపించారు. కోటి రూపాయల వరకు అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఆమె నుంచి డబ్బులు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలసి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎఫ్ఆర్‌టీఐ బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు ప్రదానం



అవార్డు స్వీకరిస్తున్న అజయ్‌ప్రసన్నకుమార్

తిరుపతి అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్‌కు ఎఫ్ఆర్‌టీఐ బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు లభించింది. ఎఫ్ఆర్‌టీఐ నేషనల్ జాయింట్ సెక్రటరీగా కొన్నేళ్లుగా ఆయన పలు రంగాల్లో చేసిన విశేష సేవలను గుర్తించి ఆ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం నరసారావుపేటలోని మహంఖాళీ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఫోరం ఫర్ ఆర్టీఐ రాష్ట్ర సదస్సులో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు పి.చంద్రమోహన్, నరసారావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఎంపీ బైరెడ్డి శబరికి ఘన స్వాగతం



మొక్కలు నాటుతున్న శబరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి ఎస్వీ యూనివర్సిటీలో ఘన స్వాగతం లభించింది. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్, బీజేపీ నేత పాత్తూరి శ్రీకాంత్, టీఎన్ఎస్ఎఫ్ సీనియర్ నాయకులు డాక్టర్ హరికృష్ణ యాదవ్, డాక్టర్ శేషాద్రి నాయుడు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛంతో శబరిని సత్కరించారు. అనంతరం వర్సిటీలోని శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌నాయుడు, యుగంధర్, వంశీ, దాము తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యసాయి రథోత్సవం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 13 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి దివ్య రథోత్సవం వేడుకగా సాగింది. సత్యసాయి శత జయంతి సందర్భంగా తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహతి కళా క్షేత్రం నుంచి నగర ప్రధాన మార్గాల్లో రథోత్సవం సాగింది. నాలుగుకాళ్ల మండపం, మున్సిపల్ ఆఫీస్, వీవీ మహల్ రోడ్, భవానీ నగర్ మీదుగా ఆర్ఎస్ గార్డెన్స్ వరకూ రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో సత్యసాయిబాబా భక్తులు పాల్గొని స్వామి వారిని స్మరిస్తూ భజనలు చేశారు. మనుషుల్లో, సమాజంలో మార్పు తీసుకురావడానికి సత్యసాయిబాబా అనేక విధాలుగా కృషి చేశారని భక్తులు పేర్కొన్నారు.

విచ్చలవిడిగా పార్కింగ్

వినోదం చూస్తున్న పోలీసులు - ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల ఇక్కట్లు



సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు



పీఎస్4 వద్ద నడి రోడ్డుపైనే ఆపిన వాహనాలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరంలో విచ్చలవిడి పార్కింగ్‌తో వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పడంలేదు. వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం, దానికి తగినట్లు రోడ్లు విస్తరించకపోవడం, ప్రైవేటు వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. లీలామహల్ సమీపంలోని పీఎస్-4 హోటల్ వద్ద రోడ్డుపైనే భక్తులు వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు లీలామహల్ నుంచి బస్టాండు వైపు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ఉదయం 9నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆటోవాలాలు హోటల్ ముందు ఆపి తీరిగ్గా సెల్‌ఫోన్లలో వీడియోలు చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. అదే రోడ్డులో పోలీసులు వెళుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ సాక్షిగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద బట్టలు కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులు వారి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను రోడ్డు మధ్యలో పార్కింగ్ చేసి వెళ్లారు. గంటపాటు మూడు కార్లు రోడ్డుపైనే ఆపేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నా వారు ఏ మాత్రమూ ఖాతరు చేయలేదు. దీంతో ఆ రోడ్డులో అరగంటపాటు రాకపోకలు అంతరాయం కలిగింది. ఆర్టీసీ బస్టాండు, తిరుమల బైపాస్ రోడ్డు, గోవిందరాజస్వామి ఉత్తర మాడ వీధి, తేరు, గాంధీరోడ్డు, కృష్ణాపురం ఠాణా, మంగళం రోడ్డులోని తిరుమల కేఫ్ వద్ద నడి రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక ఫ్రీ లెఫ్ట్‌లు, వన్‌వేలు ఎక్కడా కనిపించడంలేదు. నో పార్కింగ్ బోర్డులు వెక్కిరిస్తున్నాయి. దీనిపై ఎస్పీ దృష్టి సారించాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సేవలు అమోఘం

10వ వార్షికోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 13 (ఆంధ్రజ్యోతి): రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అమోఘమని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రశంసించారు. డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల నేతృత్వంలోని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వలాభం లేకుండా అంకితభావంతో సామాజిక సేవ చేస్తున్న రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ స్థాపకులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్లను ప్రత్యేకంగా అభినందించారు. ప్రముఖ గాయకుడు సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ సేవ ద్వారా తన జన్మను రమేష్‌నాథ్ లింగుట్ల సార్థకం చేసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా, తుపాను బాధితులకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా రమేష్‌నాథ్ లింగుట్ల అండగా నిలిచారని చెప్పారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరిరావు, రాస్ ప్రతినిధి వెంకటరత్నం మాట్లాడుతూ తక్కువ కాలంలో ఎక్కువ సేవ చేసిన ప్రత్యేకత రీచ్ గ్లోబల్ ఫౌండేషన్‌కు దక్కిందన్నారు. అనంతరం రమేష్‌నాథ్ లింగుట్ల సేవా కార్యక్రమాలపై అశోక్ తేజ రాసిన పాటను వీడియో రూపంలో ప్రదర్శించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

ముగిసిన తైక్వాండో పోటీలు





మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్న బాలబాలికలతో సుద్దాల అశోక్‌తేజ, ఇతర ప్రముఖులు - తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీలత, వూకా విజయ్‌కుమార్

తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. తిరుపతి, పరిసర ప్రాంతాల పాఠశాలల నుంచి సుమారు 300మంది బాలబాలికలు పోటీలలో ప్రాతినిధ్యం వహించారు. అండర్ 7, 11, 14, 17 విభాగాలలో విశేష ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సీనియర్ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. అన్ని విభాగాలలో కలిపి 60బంగారు, 45వెండి, 110రజితం పతకాలు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ప్రధానమని, తల్లిదండ్రులు ఆ దిశగా పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కాగా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలత ఉదయం తైక్వాండో పోటీలను ప్రారంభించి పిల్లల భవిష్యత్తుకు సంబంధించి సందేశమిచ్చారు. న్యాయ నిర్ణేతలుగా సుదర్శన్(చెన్నై), బాలకృష్ణ(తిరుపతి), ఆనంద్(వైజాగ్), వెంకటేష్(కర్నూలు) వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వుకా విజయ్‌కుమార్, గ్రాండ్ మాస్టర్ బాబురావు, వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షకార్యదర్శులు టి.దామోదరం, ఎం.నాగార్జున, మణికంఠ, తహసున్నీషాబేగం, పురుషోత్తం, నారాయణ, ముకేష్, మునిలక్ష్మి పాల్గొన్నారు.

నవోదయ, సైనిక్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- దరఖాస్తుకు ఈనెల 29 చివరి తేదీ
- నవోదయ ప్రవేశ పరీక్ష అవగాహన సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), జూలై 13(ఆంధ్రజ్యోతి): నవోదయ, సైనిక్, మిలిటరీ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథరెడ్డి చెప్పారు. నవోదయ ప్రవేశ పరీక్షపై వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించిందని తెలిపారు. 35ఏళ్లుగా తిరుపతి విశ్వం విద్యాసంస్థ సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులను సాధిస్తోందని తెలిపారు. 2026-27 సంవత్సరానికి నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 29వ తేదీ చివరి తేదీ అని, డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగనుందని వెల్లడించారు. పోటీ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాలకు 86888 88802 / 93999 76999లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

నేడు శ్రీవారికి పరదాల సమర్పణ



తిరుపతి(ఆటోనగర్), జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన వాసు టైలర్స్ అధినేత మేకల సుబ్రమణ్యం(మణి) తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు మూడు తెరలను(పరదాలు) సిద్ధం చేశారు. వాటిని సోమవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అధికారులకు అందించనున్నారు. ఉగాది ఆస్థానం, ఆణివారి ఆస్థానం, సాలకట్ల బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల కోసం మూడు చొప్పున ప్రత్యేక పరదాలను తయారు చేస్తారు. ఒకరోజు ముందు కాలి నడకన తిరుమలకు చేరుకుని పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయాధికారులకు అందజేస్తామని మణి తెలిపారు. 27 ఏళ్లుగా పరదాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు.





ఆర్సీపురానికి వెళ్లే మార్గంలో ఖాళీ ప్రదేశంలో పడేసిన వ్యర్థాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ - చెత్త సంపద కేంద్రంలో క్లీనింగ్ పనులు

చెత్త, వ్యర్థాల తొలగింపు

తిరుపతిరూరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ పరిధిలో ఆర్సీపురానికి వేళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో పడేసిన చెత్త, భవన వ్యర్థాలను ఆదివారం తొలగించారు. పంచాయతీ పరిధిలో గేట్ కళాశాల నుంచి స్వర్ణముఖి నదికి సమీపంలోని శివాలయం వరకు రోడ్డుపక్కనే పడేసిన వ్యర్థాలను ఎక్స్‌కవేటర్ల సాయంతో ట్రాక్టర్ల ద్వారా రామాపురం డంపింగ్ యార్డుకు తరలించారు. ఖాళీ ప్రదేశంలో రోడ్డుపక్కన చెత్తవేస్తే రూ.10వేల అపరాధ రుసుం వేస్తామని పంచాయతీ అధికారులు హెచ్చరించినా కొందరు గుట్టుచప్పుడు కాకుండా పడేసి వెళుతున్నారు. దీంతో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. డీఎల్పీవో స్పందించి పంచాయతీ కార్యదర్శికి సూచించడంతో తొలగింపునకు సత్వర చర్యలు చేపట్టారు. అలాగే చెత్తసంపద తయారీ కేంద్రం ప్రాంగణంలో క్లీనింగ్ పనులు చేపట్టారు. ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి, ఎత్తు పల్లాలుగా ఉన్నచోట ఎర్రమట్టి తోలి చదును చేశారు. సచివాలయ ప్రాంగణంలోనూ మట్టిని తోలి చదును పనులు చేశారు. కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మురళికి అశోక్‌తేజ పరామర్శ



తిరుపతి (ఆటోనగర్), జూలై 13 (ఆంధ్రజ్యోతి): తల్లిని కోల్పోయిన సీఐటీయూ నేత కందారపు మురళిని ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. యశోదనగర్‌లోని కందారపు మురళి సోదరుడు మోహన్ నివాసంలో ఉన్న కుటుంబ సభ్యులను పలకరించి సానుభూతి తెలిపారు. కందారపు రాజమ్మ కళ్ల దానం చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల నిర్మల, రంగస్థల కళాకారుడు ధర్మయ్య, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లవరపు నాగార్జున ఉన్నారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో మూడో స్థానం



తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్(అండర్ 13) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తిరుపతి జిల్లా జట్టు మూడో స్థానం కైవసం చేసుకుంది. రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సి-గ్రూప్‌లో విజేతలుగా నిలిచిన విశాఖపట్నం, కాకినాడ జట్లపై తిరుపతి జిల్లా జట్టు విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో పోరాడినా ఓటమి తప్పలేదు. మూడో స్థానం కోసం నిర్వహించిన పోటీలో కడప జట్టుపై విజయం సాధించి బ్రాంజ్‌మెడల్‌తో సరిపెట్టుకుంది. క్రీడాకారులను, కోచ్‌లు వినోద్, రమేష్‌లను ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప అభినందించారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

తిరుపతి (ఆటోనగర్), జూలై 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం 16, 17 డివిజన్లలో పార్టీ శాఖల మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి తమ పార్టీ ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. విస్తరణకు కాలనీలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్వచ్ఛ నగరం పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న ప్రస్తుత పాలకులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. తిరుపతిలో భూ కబ్జాదారులను అడ్డుకుని పేదలకు పంచిన ఘనత సీపీఐదేనన్నారు. నగర ప్రజలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలు రద్దు చేసి, ఎన్నికల హామీ మేరకు రెండు సెంట్లతో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో నాయకులు అల్లాబక్ష్, విశ్వనాథ్, చలపతి, నాగరాజు, శివ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రమాదకరంగా చీమలవారివంక కాజ్ వే



వడమాలపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో చీమలవారివంకపై ఉన్న కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతులు భారీ వాహనాల రాకపోకలతో కుంగింది. గత సంవత్సరం డిసెంబరులో తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే కుంగింది. సుమారు పది రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వడమాలపేటవాసులు ఆటోలను ఆశ్రయించి బైపాస్ రోడ్డుకు చేరుకుని తిరుపతి, పుత్తూరులకు వెళ్లారు. ప్రజల ఇబ్బందులను పరిశీలించిన ఎమ్మెల్యే భానుప్రకాష్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కాజ్‌వేను పునః నిర్మిస్తామని చెప్పారు. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. కాగా కాజ్‌వే ప్రమాదకరంగా ఉండడంతో తిరుపతి నుంచి ఆర్టీసీ బస్సులు ఆదివారం వడమాలపేటకు రాలేదు. బైపాస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించడంతో స్థానికులు ఆటోలను ఆశ్రయించి వడమాలపేటకు చేరుకోవాల్సి వచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి చీమలవారి వంక కాజ్‌వేకు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కాలువల్లో సిల్టు తొలగింపు



ఉప్పు కాలువలో సిల్టు తొలగింపు పనులు

పుత్తూరు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాలువల్లో పేరుకుపోయిన సిల్టు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. చిన్నపాటి వర్షాలకు కూడా కాలువలు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని కాలువల్లో సిల్టు తొలగింపునకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో చిన్న మురుగునీటి కాలువలు 82.52 కిలోమీటర్లు, మధ్య రకం కాలువలు 5.58 కిలోమీటర్లు, మేజర్ కాలువలు 3.60 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. వీటిల్లో సిల్టు తొలగించడానికి రూ.15 లక్షలు నిధులు కేటాయించారు. ఉప్పుకాలువలో వర్షపు ఉధృతంగా పారితే భవానీనగర్ ప్రాంతంలోకి నీరు చేరుతోంది. దీంతో మొదట ఉప్పు కాలువలో సిల్టు తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. చిన్నపాటి కాలువల్లో దినసరి కూలీలలో సిల్టు తొలగిస్తామని కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు.

కొల్లాపురమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కల్యాణపురం ఎస్టీకాలనీలో కొలువై ఉన్న కొల్లాపూరమ్మ అమ్మవారి ఆలయంలో జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. ఎస్టీ కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

వైభవంగా వినాయక ఆలయ కుంభాభిషేకం



వినాయకుడికి ప్రత్యేక పూజలు

వడమాలపేట,జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు వారిండ్లు సమీపంలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వాస్తుహోమం, శనివారం కలశ స్థాపన, తాళవర్ణ హోమం, ఆదివారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనుంజయులు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులు మునిశేఖర్, వెంకటేష్, చిరంజీవి, రామకృష్ణ, కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.


ధ్యానంతో ఒత్తిడి దూరం

పుత్తూరు టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్రినేత్ర పిరమిడ్ దివ్య ధ్యాన కేంద్రంలో ఆదివారం ధ్యాన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన శిక్షకురాలు బొల్లిని జానకమ్మ జీవాత్మ-పరమాత్మపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. నిత్య జీవితంలో ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. ధ్యానం ద్వారా మనసు శూన్య స్థితికి చేరుకున్నప్పుడు శరీరంలో కలిగే శ్రేయస్సు, హార్మనులు సమతుల్యత, ఒత్తిడి నివారణ తదితర అంశాలపై వివరంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, హరిత, ప్రశాంత్, నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

పుత్తూరు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని పార్టీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ సి.కే.కార్తికేయన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

రెండు దశాబ్దాలుగా విద్యాసేవలో సరస్వతి సమాజం



జ్ఞాపికలతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

పుత్తూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా విద్యను ప్రోత్సహిస్తూ సరస్వతి మాతా సాంఘిక సేవా సమాజం సేవ చేయడం అభినందనీయమని పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆరు మండలాల్లోని 750 మంది విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన బోధనా సామగ్రిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందించారు. అలాగే మండలంలోని 12 పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన టెన్త్ విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ ఏడాది శ్రీసాయిజ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఇద్దరు అనాథ విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సమాజం పేర్కొంది. విశ్రాంత ఎంఈవో యుగంధర్ రాజు, ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, సమాజం నిర్వాహకుడు మాడా ప్రసాద్, రవిశంకర్, కుమరవేలు, బాలసుబ్రమణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

పుత్తూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపగుంట పంచాయతీలో డెంగీ నివారణ ముందస్తు జాగ్రత్తలను ప్రభుత్వ డాక్టర్ నాగభూషణ రెడ్డి వివరించారు. ఎంపీపీ మునివేలు ఆధ్వర్యంలో ఆదివారం డెంగ్యూ నివారణ అవగాహన కార్యక్రమం జరిగింది. అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సర్పంచ్ గిరిజప్రసాద్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గంగమ్మకు నెల పొంగళ్లు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

చిల్లకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పాలబూతు సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు నెలపొంగళ్లు పెట్టారు. ముందుగా గంగమ్మకు అభిషేకాలు జరిపి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గత నెల 13నుంచి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు గంగమ్మ జాతర నిర్వహించారు. నెలరోజులు పూర్తి కావడంతో ఆదివారం ఆలయం వద్ద మహిళా భక్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.





చిల్లకూరులోని వినాయకుడి గుడి, పాలకేంద్రం సమీపంలో, దళితవాడ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

మలుపులు.. ప్రమాదాల పిలుపులు

చిల్లకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులో ప్రధాన రహదారిపై ఒకటన్నర కిలోమీటర్ల దూరంలోనే ఆరు మలుపులు ఉన్నాయి. మండల కేంద్రమైన చిల్లకూరు మీదుగా అయ్యవారిపాళెం, మేగనూరు, దివిపాళెం, తీపనూరు, ఓడూరు, ఎగువరాజుపాళెం తదితర గ్రామాలకు ప్రధాన రహదారి ఉంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రధాన రహదారిపై ఒక్క చిల్లకూరు గ్రామంలోనే ఒకటన్నర కిలోమీటర్ల దూరంలో ఆరు మలుపుల ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సూచిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారు మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక దళితవాడ సమీపంలోని మలుపు వద్ద గతంలో ఆటో బోల్తాపడి పలువురు గాయపడ్డారు. అదేవిధంగా పాలబూతు సమీపంలో, వినాయకుడి ఆలయం సమీపంలోని మలుపుల వద్ద పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద వేగ నిరోధకాలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: విజయశ్రీ



సాయినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టి, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సమస్యలను తమ దృష్టి తీసుకు వస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, శ్రీనివాసులు, రాజశేఖర్, వీవీసురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

గూడూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నరసింగరావుపేటలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం నూతన కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, బాలకృష్ణ, మనోజ్ కుమార్, శ్రీనివాసరావు, సురేష్, వాసు, భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పెళ్లకూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలోని ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి కిషన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, నాయకులు, ఎద్దల రామకృష్ణారెడ్డి, కొమ్ముతోటి కైలాష్, పృథ్వీరాజు, నరసయ్య, భరత్‌కుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఆనంద్‌కు మాతృవియోగం



మణెమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రఫీ తదితరులు

నాయుడుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ వార్డు సభ్యుడు సానాపుత్తూరు ఆనంద్‌కు మాతృవియోగం కలిగింది. ఆనంద్ తల్లి మణెమ్మ(83) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆనంద్ కుటుంబ సభ్యులు సుధాకర్, రవి, శీనులను ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ, ఉగ్గుమూడు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, లోకనాధం, జువ్వలపాటి మస్తాన్, సునీల్‌రెడ్డి, కిరణ్ తదితరులు పరామర్శించారు.

ఆర్థిక సాయం

నాయుడుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరులో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మునీశ్వర్ మృతి చెందాడు. అతడి స్నేహితులైన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, నాగరాజు, ప్రసాద్, బి.వెంకటేశ్వర్లు రూ.30వేల నగదు మునీశ్వర్ కుటుంబసభ్యులకు అందజేసి తమ స్నేహ ధర్మాన్ని చాటుకున్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమం 471కి చేరింది. పట్టణంలోని మన్నారు పోలూరుకు చెందిన కామిరెడ్డి రత్నమ్మ(85) ఆదివారం మృతి చెందారు. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడికి అభినందనలు



మాధవ్‌తో కోటేశ్వరరావు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు కేవీఎం మాధవ్‌ను ఆ పార్టీ నేత కొమారి కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కోట మండలానికి చెందిన కోటేశ్వరరావు ఆదివారం హైదరాబాదులో మాధవ్‌ను కలిసి అభినందలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో మూడో స్థానం

తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్(అండర్ 13) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తిరుపతి జిల్లా జట్టు మూడో స్థానం కైవసం చేసుకుంది. రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సి-గ్రూప్‌లో విజేతలుగా నిలిచిన విశాఖపట్నం, కాకినాడ జట్లపై తిరుపతి జిల్లా జట్టు విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో పోరాడినా ఓటమి తప్పలేదు. మూడో స్థానం కోసం నిర్వహించిన పోటీలో కడప జట్టుపై విజయం సాధించి బ్రాంజ్‌మెడల్‌తో సరిపెట్టుకుంది. క్రీడాకారులను, కోచ్‌లు వినోద్, రమేష్‌లను ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి
ఐదుగురి అరెస్టు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం పంచాయతీ వీరారెడ్డిసత్రంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి రూ.4,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఆదివారం

ముత్యాలమ్మకు పూజలు



ప్రత్యేకాలంకారంలో ముత్యాలమ్మ

చిల్లకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మకు పూజలు



కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికిపలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

తిరుపతి(ఆటోనగర్), జూలై13(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం 16, 17 డివిజన్లలో పార్టీ శాఖల మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి తమ పార్టీ ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. విస్తరణకు కాలనీలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్వచ్ఛ నగరం పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న ప్రస్తుత పాలకులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. తిరుపతిలో భూ కబ్జాదారులను అడ్డుకుని పేదలకు పంచిన ఘనత సీపీఐదేనన్నారు. నగర ప్రజలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలు రద్దు చేసి, ఎన్నికల హామీ మేరకు రెండు సెంట్లతో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో నాయకులు అల్లాబక్ష్, విశ్వనాథ్, చలపతి, నాగరాజు, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

నరకప్రాయంగా రాజుపాళెం రోడ్డు



అధ్వానంగా ఉన్న రాజుపాళెం రోడ్డు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి నుంచి రాజుపాళెం మీదుగా ఊనుగుంటపాళెం ఆర్అండ్‌బీ రోడ్డులో కలిసే దారి అధ్వానంగా మారింది. రాజుపాళెం రోడ్డు మీదుగా గూడలి, రాజుపాళెం, ఊనుగుంటపాళెం, రుద్రవరం, మైక్రోటవర్ కాలనీకి చెందిన వాహనచోదకులు, పాదచారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు తారు లేచిపోయి రాళ్లు తేలి ఉండడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రాజుపాళెంరోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె



మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమానవేతనం చెల్లించాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అలాగే గతంలో చేసిన 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్, సుబ్రహ్మణ్యం, బాలయ్య, కామేశ్వరరావు, బాబురావు, శివకుమార్, బీవీ రమణయ్య, మణి, ప్రసాద్, నారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పదాలకు సంబంధించి జీవో అమలు చేయాలన్న డిమాండ్లతో ఆదివారం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య, వెంకటసుబ్బయ్య, నరసింహులు, బుజ్జమ్మ, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

కోటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న కంటి వైద్య నిపుణులు

కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని ప్రగతి పాఠశాలలో ఆదివారం తిరుపతి అరవింద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 200 మంది పరీక్షలు చేయించుకోగా, 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి తిరుపతిలోని అరవింద కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన తైక్వాండో పోటీలు



మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్న బాలబాలికలతో సుద్దాల అశోక్‌తేజ

తిరుపతి(క్రీడలు), జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. తిరుపతి, పరిసర ప్రాంతాల పాఠశాలల నుంచి సుమారు 300మంది బాలబాలికలు పోటీలలో ప్రాతినిధ్యం వహించారు. అండర్ 7, 11, 14, 17 విభాగాలలో విశేష ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సినీయర్ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అన్ని విభాగాలలో కలిపి 60బంగారు, 45వెండి, 110రజితం పతకాలు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ప్రధానమని, తల్లిదండ్రులు ఆ దిశగా పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కాగా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలత ఉదయం తైక్వాండో పోటీలను ప్రారంభించి పిల్లల భవిష్యత్తుకు సంబంధించి సందేశమిచ్చారు. న్యాయనిర్ణేతలుగా సుదర్శన్(చెన్నై), బాలకృష్ణ(తిరుపతి), ఆనంద్(వైజాగ్), వెంకటేష్(కర్నూలు) వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వుకా విజయ్‌కుమార్, గ్రాండ్ మాస్టర్ బాబురావు, వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షకార్యదర్శులు టి.దామోదరం, ఎం.నాగార్జున, మణికంత, తహసున్నీ షాబేగం, పురుషోత్తం, నారాయణ, ముకేష్ పాల్గొన్నారు.

ఈ యేడాదీ మట్టి వంతెనే దిక్కు!



కేవీబీపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి గ్రామాలకు వెళ్లే దారిలో కాళంగి యేరుపై ఏర్పాటు చేసిన మట్టి వంతెన ఈ యేడాదికూడా అదే దిక్కు. అని పూడి, ఎగువపూడి, దిగువపూడి, పూడి సీకేపురం, పోలి నాయుడుకండ్రిగ తదితర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యేటా వర్షాకాలంలో మట్టి వంతెన కొట్టుకుపోవడం... జలదిగ్బంధంతో తాము చిక్కుకుంటున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మిస్తామని రాజకీయ నాయకులు, అధికారులు ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామస్తులు ఎమ్మెల్యే ఆదిమూలానికి వంతెన నిర్మించాలని వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఈ యేడాది కూడా మట్టి వంతెనతోనే సర్దుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలుగుగంగ నీటితో చెరువులు జలకళ

● విస్తారంగా వరి సాగు



పల్లమాల సమీపంలో సాగవుతున్న వరి - నిండుకుండలా పల్లమాల చెరువు



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుగంగ నీటితో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో రైతులు వరిని విస్తారంగా వేశారు. మండలంలో సాధారణంగా ఖరీ్‌ఫలో బోర్లు, బావులు కింద సుమారు 1600 ఎకరాల్లో వరి, వేరుశనగ ఇతర పంటలు వేసేవారు. ఈ ఏడాది రెండు నెలలు నుంచి తెలుగుగంగ నీటిని విడుదుల చేస్తుండడంతో మండలంలో చాలా చెరువులు నిండాయి. దీంతో చెరువు ఆయకట్టు భూముల్లో రైతులు వరి నాటారు. తెలుగుగంగ నీటిని నమ్ముకుని సుమారు 2500 ఎకరాల్లో వరితో పాటుగా వివిధ పంటలు వేశారు. కొన్ని గ్రామాలలో పంటలు వేయకపోయినా చెరువులను నింపుకుంటున్నారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



ఆరూరులో కరపత్రం పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

సత్యవేడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తోందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని చెంగంబాక్కం, గొల్లవారిపాళెం, మల్లవారి పాళెం ఈస్ట్, ఆరూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంచారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల విధ్వంస పాలనతో కుంగిపోయిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు పాలనా దక్షత ఎంత అవసరమో ప్రజలు గుర్తించారన్నారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పరమశివం, రాధయ్య, పీఎస్‌రాజు, బాలరాజు, చిన్న, శశిమోహన్, హేభూషణం, శివానందం, బాబు, ఎంఎంరవి,బాలాజీరెడ్డి, రామాంజులునాయుడు, గోపీనాథ్ రెడ్డి, పద్మనాభరాజు, తిరుమలరెడ్డి, సాధు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి ధ్యేయం



శ్రీకాళహస్తి పట్టణం, అంజిమేడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలు

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం తొట్టంబేడు మండలం కత్తివారి కండ్రిగ, బసవన్నగుంటల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తల్లికి వందనం, వృద్ధాప్య పింఛను, గ్యాస్ సబ్సిడీ ప్రజలకు అందడంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి మురళీనాయుడు, ఎస్సీవీ దిలీప్, ఎస్సీవీ కిరణ్, గురుదశరథన్, మోహన్‌నాయుడు, గాలి బాలాజీనాయుడు, హరినాయుడు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

● కూటమి ధ్యేయమని కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని మంచినీళ్లగుంట ప్రాంతంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందించినసంక్షేమ పథకాలను వివరించారు. ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇందుకు ప్రజలు తమకు పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు లక్ష్మమనేని మధు, గాజుల భగత్, మునిరాజాయాదవ్, డీవీ నారాయణ, మురళీనాయుడు, సుబ్రహ్మణ్యం, ఆకుల సునీత, ప్రమోద్, హర్షవర్ధన్,

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు అన్నారు. అంజిమేడులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురవారెడ్డి, నాగరాజు నాయుడు, మహేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శివాజీ రెడ్డి, కుక్క రమణ, గుణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు నాయకులకు సన్మానం

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ రిజర్వేషన్ కోసం పాదయాత్ర చేస్తున్న వారిని ఆదివారం పట్టణంలోని కాపు నాయకులు ఘనంగా సత్కరించారు. గతంలో కాపులకు రిజర్వేషన్ కల్పించిన రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని చిత్తూరు నుంచి అమరావతికి సాన ప్రసాద్ పాదయాత్ర చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఆయన శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఆయనతోపాటు శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలుకి చెందిన దండి రాఘవయ్య, వెంకట్రామయ్య బయలుదేరారు. ఈ సందర్భంగా వారిని పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సత్కరించారు. ఈ కార్యక్రమలో సిద్ధులగారి ప్రసాద్, అంజూరు శ్రీనివాసులు, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణయ్య, పసుపులేటి నవీన్, వజ్రం కిషోర్, శ్రీపురం సుధాకర్, మున్నా రాయల్, నంద తదితరులు పాల్గొన్నారు.

యువశ్రీ మురళికి సత్కారం



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఉపాధ్యాయుడిగా భాషాభివృద్ధికి చేసిన కృషికి యువశ్రీ మురళిని సత్కరించారు. కర్నూలు వేదికగా శని, ఆదివారాల్లో జరిగిన తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో తిరుపతి జిల్లా ప్రతినిధిగా యువశ్రీ మురళి పాల్గొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషికి మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ చేతులు మీదుగా యువశ్రీ మురళిని తెలుగు తల్లి జ్ఞాపిక, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు భాషోద్యమ నేతలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

వసతిగృహంలో సమస్యలపై ఆరా

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో సమస్యలను ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. మెనూ పాటిస్తున్నారా అని అడిగారు. మిగిలిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మునిచందు, అభి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రం భక్తజన సందోహం



ఆలయంలోని క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 892 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,552, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 5,490మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,320 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,819, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 463మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 298, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 101మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,706 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

15నుంచి విజ్ఞానగిరిలో ఆడికృత్తిక ఉత్సవాలు



శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 20న ఆడికృత్తిక మహోత్సవం జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. 15నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 15న అంకురార్పణ, 16న వల్లీదేవసేన సమేత చెంగల్వరాయ స్వామి గర్భాలయంలో ధ్వజారోహణం, అంబారీ ఉత్సవం, 17న రెండో తిరునాళ్ల, సూర్యప్రభ వాహనం, రాత్రి భూతవాహనం, 18న మూడో తిరునాళ్ల, ఉదయం హంసవాహనం, రాత్రి రావణాసుర వాహనం, 19న నాల్గో తిరునాళ్ల, ఉదయం యాళి, శేషవాహనాలు, 20న ఆడి కృత్తిక, ఉదయం ఇంద్రవిమానం, రాత్రి మయూర వాహనం, 21న ఆరో తిరునాళ్ల, ఉదయం ఇంద్ర విమాన రథ అలంకరణ, రాత్రి నారద పుష్కరణిలో తెప్పోత్సవం, 22న ఏడో తిరునాళ్ల, ఉదయం చిలుక వాహనం, రాత్రి గజ వాహనం, విజ్ఞానగిరి మండపం వద్ద వల్లీ దేవసేన చెంగల్వ రాయస్వామి కల్యాణోత్సవం, 23న చప్పరం, పార్వేట ఉత్సవం, 24న ఉదయం కేడిగ వాహనం, వసంతోత్సవం, ధ్వజావరోహణం, గ్రామోత్సవం, 25న రాత్రి 8 గంటలకు పల్లకీసేవ జరగనుందని ఈవో తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం పీపీపీ అంజనీకుమారి - రిజిస్ట్రార్ కమలాకర్‌రెడ్డి - ఎంపీ బైరెడ్డి శబరి

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీ శ్వరుడిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్) కమలాకర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కోర్టు ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాస్ నాయక్, ఆలయ అధికారులు ఏఈవో మోహన్, పీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్ సిటీ కాజస్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీపీపీ అంజనీకుమారి కూడా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

నిత్యావసరాల పంపిణీ



శ్రీకాళహస్తి జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మతగురువు జనాబ్ ముఫ్తీ నహీం సాహెబ్ మాట్లాడుతూ.. ఏ మతమైనా తనకున్న దానిలో పేదవారికి సాయం చేయమని చెబుతుందన్నారు. ఆ దిశగా హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, కంఠా ఉదయ్, సంస్థ సభ్యులు బాబాఫరీద్, ల్యాంకో షరీఫ్, కలాం తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రం బాగు చేయండి



కేవీబీపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేవీబీపురంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. కేంద్రం గ్రామం వెలుపల ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రానికి ఏర్పాటు చేసిన రేకులను చోరీ చేశారు. సంబంధిత పంచాయతీ అధికారులు సంపద తయారీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

కంటి వైద్యశిబిరానికి స్పందన



వరదయ్యపాళెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య ఉచిత శిబిరానికి స్పందన లభించింది. మొత్తం 57 మందిని శంకర నేత్రాలయ వైద్యులు పరీక్షించి 27మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారిని శస్త్రచికిత్స కోసం చెన్నైలోని శంకర నేత్రాలయకు తరలించారు. శిబిరంలో పాల్గొన్న వారికి మధ్యాహ్నం భోజన వసతిని రాజేంద్ర కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ విజయలక్ష్మీ, వెన్నెల బాలకృష్ణ, డైనమిక్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో 1981 - 82 విద్యార్థులు

పిచ్చాటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళ త్తూరు జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో ఆదివారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పిచ్చాటూరు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి మాట్లాడుతూ 1981-82లో ఈ పాఠశాలలో టెన్త్ చదువుకున్న మేము 43 ఏళ్ల తరువాత ఆత్మీయంగా కలిశామన్నారు. ఒకరిని ఒకరు పలకరించుకుంటూ, కుశల ప్రశ్నలు వేసుకుంటూ రోజంతా, గతంలో తాము చేసిన చిలిపి చేష్టలు, అల్లరి పనులు గుర్తు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. పాఠశాలకు మౌలిక వసతులను కల్పించడం కోసం ఆర్థికంగా చేయూత నందిస్తామని చెప్పారు. హేమకుమార్, రవి, జనార్దన్, సోమశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డు ఎన్టీఆర్‌నగర్‌లో దేవరాజు శనివారం మృతి చెందాడు. ఆయన దినసరి కూలీ. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సొంతిల్లు లేదు. దీంతో ఈ విషయాన్ని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి ఫోన్ ద్వారా ఎమ్మెల్యే సుధీర్‌కు వారి కుటుంబ పరిస్థితిని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ సొమ్మును ఆదివారం నెమళ్లూరు బుజ్జి టీడీపీ నేతలు సుమతమ్మ, శివకుమార్, మీర్జా, సంపత్ మృతుడి కుటుంబానికి అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కోట చంద్రబాబు వ్యాఖ్యల ఖండన

రేణిగుంట, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాయుడు హత్య వెనుక ఎమ్మెల్యే సుధీర్ హస్తం ఉన్నట్టు వస్తున్న ఆరోపణలను టీడీపీ నాయకులు ఖండించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు వారి వ్యక్తిగత సహాయుడిని హత్య చేశారన్న అభియోగాలపై చెన్నై పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందేనని రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మెహబూబ్ బాషా అన్నారు. చెన్నైలో కోట చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ... ఈ సంఘటన వెనుక ఎమ్మెల్యే సుధీర్ ఉన్నారని నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయుడు మృతిపై విచారణ జరిపించాలి: సీపీఐ

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): జనసేన నేతల చేతిలో హత్యకు గురైన కోట వినుత కారు మాజీ డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు ఘటనపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని సీపీఐ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. రాయుడు హత్య వ్యక్తిగత కారణాలా... రాజకీయ కారణాలా అని తేల్చాలన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

రేణిగుంట, జూలై 13(ఆంధ్రజ్యోతి):విద్యుదాఘాతకానికి బాలుడు మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ సుధాకర్ తెలిపారు. అసోం రాష్ట్రానికి చెందిన వలస కూలీలు అముతుల్ ఇస్లాం, ఆయన భార్య ఇమాదర్‌కు ముగ్గురు సంతానం. రెండు నెలల క్రితం తిరుపతి నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డ్ సమీపంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం అముతుల్ పెద్ద కుమారుడు హుస్సేన్ ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న విద్యుత్తు తీగ తగిలి అక్కడకక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రూయా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

రేణిగుంట్ట, జూలై 13(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రౌడీయిజానికి పాల్పడినా, బెదిరించినట్టు ఫిర్యాదు వచ్చినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ జయచంద్ర హెచ్చరించారు. వారానికి ఒకసారి పోలీస్ స్టేషనుకు వచ్చి హాజరుకావాలని హెచ్చరించారు.

నాలుగు వాహనాల స్వాధీనం



రేణిగుంట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం చెరువులో మూడు ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం వెంకటాపురం చెరువులో మట్టిని తవ్వుతున్నట్టు స్థానికులు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపారు. వారు విచారణ జరిపి అనుమతులు లేకపోవడంతో మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. అయితే చెరువు పక్కన మునీశ్వరుడు గుడి దగ్గర మట్టిని ఎత్తుగా పోశామే తప్ప వెలుపలికి తరలించలేదని వాహనాల యజమానులు చెప్పారు.

వెంకటాపురం కొండకు నిప్పుపై విచారణ

రేణిగుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం కొండకు నిప్పుఅంటుకోవడంపై పలు అనుమానాలకు దారి తీస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న వెంకటాపురం కొండకు మార్చి, మే నెలల్లో ఒకే ప్రాంతంలో నాలుగుసార్లు నిప్పు అంటుకుంది. గత నెల విమానాలకు సిగ్నల్ ఇచ్చే లైట్‌కు సమీపంలో మంట అంటుకోవడంపై విమానాశ్రయ అధికారులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం. ఈ విషయంపై అటవీ శాఖ జిల్లా అధికారి వివేక్ వివరణ కోరగా.. వెంకటాపురం కొండ వద్ద జరిగిన సంఘటనపై విచారణ చేపట్టాలని సబ్ డీఎఫ్‌వో నాగేశంకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

పిచ్చి మొక్కలతో మూసుకుపోతున్న వీధులు



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న వీధులు పిచ్చి మొక్కలతో మూసుకుపోతున్నాయి. సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు కమ్మి వేయడంతో నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు దట్టంగా ఉండటంతో పాములకు నిలయంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాల్సి ఉంది.

యువతి అదృశ్యం

కేవీబీపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన యువతి(19) ఈనెల 9న రేణిగుంటలో ఉన్న పరిశ్రమలో పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆమె తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాట్రపల్లికి చెందిన వివాహితుడుపై తమకు అనుమానంగా ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.